క్లుప్తంగా

ప్రక్కిలంకలో మహా కుంభాభిషేకం



ఆలయ శిఖరంపై మహా కుంభాభిషేక పూజలు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొత్తవరపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారి కల్యాణం, గోదావరి జలాలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆదివారం మహాన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు శశిశేఖర మిత్ర బృందం తెలిపింది.

నేడు గోష్పాద క్షేత్రంలో వేదసభ

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని నిరంజన ధర్మజ్ఞాన కళావేదికపై శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు వేద సభ, పారాయణం నిర్వహించనున్నట్టు గోష్పాద క్షేత్ర వేద శాస్త్రాభివర్ధక పరిషత్ సభ్యులు తెలిపారు. అలాగే 10వ తేదీ ఉదయం ఐదు నుంచి ఎనిమిది గంటల వరకూ ఇక్కడి సుందరేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తామన్నారు.అనంతరం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం రెండు గంటలకు లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఆరు గంటలకు వేదసభ, పండితులకు సత్కారాలు ఉంటాయన్నారు.11న విభూతితో శివాభిషేకం నిర్వహిస్తామన్నారు. కార్తిక మాసం చివరి సోమవారం 108 శివ లింగాలతో ఈ అభిషేకం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ శివలింగాలు ఇచ్చి అభిషేకం అనంతరం ఇంటికి తీసుకెళ్లవచ్చన్నారు.

నేడు గౌడ సంఘం వన సమారాధన

దేవరపల్లి: జాతీయ రహదారిపై దేవరపల్లి-యాదవోలు మధ్య గల కూచిపూడి బుల్లారావు పామాయిల్ తోటలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరుగుతుందని ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సమారాధన ప్రారంభం అవుతుందని, గ్రామంలోని గౌడ కుటుంబ సభ్యులంతా హాజరు కావాలని సంఘ ప్రతినిధులు తెలిపారు. అలాగే స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తిక మాసం సందర్భంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి వన సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఉండ్రాజవరంలో యూత్ క్రిస్మస్

ఉండ్రాజవరం: స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయంలో శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి వార్షికోత్సవ వేడుక, యూత్ క్రిస్మస్ నిర్వహిస్తారు. లూథరన్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయని పాస్టర్ ఆర్.ఇశ్రాయేల్, యూత్ ప్రెసిడెంట్ నూకపెయ్యి రాకేష్ (టోని), కన్వీనర్ పి.వినయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ వర్తమానికుడు జోనా సామ్యేల్ క్రిస్మస్ సందేశం ఇస్తారన్నారు. సువార్త గాయకులు బ్రదర్ నిస్సీ జాన్ పాల్గొనే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బంగారు పాపమ్మ ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో బంగారు పాపమ్మ

తాళ్లపూడి: అన్నదేవరపేట గ్రామస్తుల ఆరాధ్య దేవతైన బంగారు పాపమ్మ వారి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు రుద్రపాక వంశస్తుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి పలు రకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని, ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అన్నదేవరపేట ఆడపడుచులు అమ్మవారికి గాజులు, చీరలు సమర్పించారు. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పోశిన శ్రీకృష్ణదేవరాయలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏడు మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

నల్లజర్ల: రాష్ట్ర కంట్రోల్ రూమ్ నుంచి అందిన సమాచారం మేరకు దేవరపల్లి ఎస్ఈబీ పోలీసులు శుక్రవారం నల్లజర్ల మండలంలోని తూర్పుచోడవరం గ్రామంలో దాడులు జరిపారు. ఈ గ్రామంలోని దొడ్డిగర్ల ప్రభాకరరావు అనే వ్యక్తి ఇంట్లో ఏడు మద్యం బాటిళ్లను వారు స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.సుధీర్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. అలాగే వివిధ గ్రామాలకు చెందిన పాత ముద్దాయిలు ఐదుగురిని నల్లజర్ల తహసీల్దారు కిశోర్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్టు సిఐ డి.సుధ తెలిపారు.

ముంపు నుంచి తేరుకోని పంటలు

- నీటిలోనే ఉన్న వరి పైరు
- ముంచెత్తిన కొవ్వాడ, ఎర్ర కాలువలు
- రెండు మండలాల్లో వెయ్యి ఎకరాల పంట నష్టం



దేవరపల్లి మండలం త్యాజంపూడి వద్ద ఎర్ర కాలువ వరద ముంపులో ఉన్న వరి పైరు



యర్నగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గండి చెరువు

దేవరపల్లి: మిచాంగ్ తుపాన్ ప్రభావం తగ్గినప్పటికీ ముంపు నుంచి ఇంత వరకూ పంటలు తేరుకోలేదు. రోజుల తరబడి నీటిలో ఉన్న వరి, మినుము పంటలు కుళ్లిపోతున్నాయి. వరి చేలు ఇప్పటికీ మోకాలి లోతు నీటిలో ఉన్నాయి. వారం రోజులుడి పంట నీటిలో ఉండడం వల్ల వరి దుబ్బులు కుళ్లిపోతున్నాయని, మినుము చేలు మొలకలు వస్తున్నారని రైతులు వాపోతున్నారు. పీఎల్‌ఏ- 1100 రకం వంగడం వరి పంట కోతలు పూర్తికాలేదు. దాదాపు 20 శాతం పంట కోయవలసి ఉంది. దేవరపల్లి మండలంలో ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువల ప్రవాహ ఉధృతికి పంటలు పూర్తిగా నీట మునిగాయి. ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహించి త్యాజంపూడిలో పంట పొలాలను ముంచెత్తింది. త్యాజంపూడి, కురుకూరు గ్రామాల్లో ఎర్ర కాలువ ముంపు వల్ల సుమారు 500 ఎకరాల్లో వరి పంట, 50 ఎకరాల్లోని మినుము పంట కుళ్లిపోయినట్టు రైతులు తెలిపారు. ఏటా వర్షా కాలంలో ఎర్ర కాలువ ముంపునకు పంటలు దెబ్బతింటున్నాయి. ఒక పక్క ఎర్ర కాలువ, మరో పక్క ఆవ చెరువు పొర్లు నీరు పంటలను ముంచాయి. మరో పక్క దేవరపల్లి మండలం గౌరీపట్నం, గోపాలపురం మండలం చెరుకుమిల్లి, చిట్యాల గ్రామాల్లోని వరి పైరును కొవ్వాడ కాలువ ముంచెత్తింది. రెండు మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పొలాల్లోని నీరు తగ్గిన తర్వాత పూర్తిస్థాయి నష్టం తెలుస్తుందని వారు తెలిపారు.

పొంగి ప్రవహిస్తున్న చెరువులు

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మెట్ట ప్రాంతంలోని సాగు నీటి చెరువులకు జలకళ వచ్చింది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహించి వచ్చిన వర్షపు నీరు చెరువుల్లో చేరడంతో అవి నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. దేవరపల్లి మండలంలోని యర్నగూడెంలో సుమారు 100 ఎకరాల వైశాల్యం గల గండి చెరువు, త్యాజంపూడిలో సుమారు 600 ఎకరాల వైశాల్యం గల ఆవ చెరువు, సంగాయగూడెంలోని పానాకల చెరువు అవుట్‌లెట్‌ల ద్వారా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాటి పొర్లు నీరు దిగువన గల పంటలను ముంచెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉండ్రాజవరం మండలంలో 300 ఎకరాల వరి

ఉండ్రాజవరం: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలోని సుమారు 300 ఎకరాల్లోని వరి, 20 హెక్టార్లలోని అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు, ఉద్యానవనశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారన్నారు. నష్టపోయిన ప్రతి రైతు వివరాలను, ఉన్నతాధికారులకు తెలియజేసినట్టు వారు తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 17 నుంచి 19 శాతం వరకూ ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నట్టు వారు తెలిపారు. మండలంలో కె.సావరం, మోర్త గ్రామాల్లో అధిక శాతం అరటి తోటలు, దమ్మెన్ను, వేలివెన్ను గ్రామాల్లో కూరగాయాల పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు వివరించారు.

ప్రజా సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యం



తాడిమళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిమళ్లలో గడప గడపకూ..

నిడదవోలు రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఇది ప్రజల ప్రభుత్వమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణ రావు, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ తాడిమళ్ల గ్రామంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, పింఛన్లు, రేషన్ కార్డులు మొదలైన వాటితో పాటు వివిధ పథకాల ఫలాలు అందజేశామన్నారు. పీహెచ్‌సీ నూతన భవనం నిర్మించడంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పార్టీ నాయకులు కాగిత లక్ష్మయ్య, తిరుమళ్ల దుర్గారావు, నిజంపూడి వెంకటేశ్వరరావు, పెనుగొండ సూరిబాబు, యాదల వరప్రసాద్, కొయ్యే బాబూరావు, ముప్పిడి సూరిబాబు, బయ్యే లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి టి.గోపాలకృష్ణ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'కొవ్వాడ' ముంపుపై నివేదిక సమర్పిస్తా

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాధవరావు
- పంట ముంపు ప్రాంతాల్లో పర్యటన



గోపాలపురం మండలం చిట్యాలలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మాధవరావు

గోపాలపురం: కొవ్వాడ కాలువ వరద వల్ల ఏటా పంటలు ముంపు బారిన పడకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు చెప్పారు. తుపాను వల్ల మండలంలోని చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఏటా పంట నష్టం ఇవ్వడం వల్ల రైతులకు ప్రయోజనం లేదన్నారు. శాశ్వత పరిష్కారానికి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులను రైతులు కోరారు. ఈయన వెంట కొవ్వూరు ఏడీఏ పి. చంద్రశేఖర్, ఏఓ బి.రాజారావు, పలువురు రైతులు ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన..

తాళ్లపూడి: తుపాను వల్ల మండలంలో నీట మునిగిన వరి చేలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, కొవ్వూరు ఏడీఏ చంద్ర శేఖర్ పోచవరం, తాడిపూడి తదితర గ్రామాల్లో పరిశీలించారు. ఈ గ్రామాల రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ పంట నష్టం వివరాల నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో జి. రుచిత, అగ్రికల్చర్ అసిస్టెంట్లు భార్గవ్ సాయి, రైతులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నగదు, రేషన్ పంపిణీ



నిత్యావసరాలు, నగదు అందిస్తున్న పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: తుపాను బాధితులు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. తుపాను ప్రభావంతో నిరాశ్రయులైన బాధితులకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. ఇళ్ల కోల్పోయిన ప్రతి ఒక్కరికి తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు, 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో నూనె, కిలో బంగాళా దుంపలు, పంచదార వంటి సరుకులు అందించారు. గృహాలు కోల్పోయిన ఖండవల్లిలోని ఐదుగురికి, ముక్కామలలో నలుగురికి, కాకరపర్రులో ఒకరికి ఈ సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, బొకే వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

గోపాలపురంలో ఎనిమిది మందికి..

గోపాలపురం: తుపాను ప్రభావంతో గృహాలు దెబ్బతిన్న గోపాలపురం పంచాయతీ పరిధిలోని బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నగదు, నిత్యావసర సరకులను శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. గోపాలపురంలో ఎనిమిది గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఒక్కొక్క ఇంటికి రూ.10 వేల నగదు, నిత్యావసర సరకులను వైస్ ఎంపీపీ ఎం.నారాయణమ్మ, సర్పంచ్ పైడి శిరీష, కప్పల వరలక్ష్మి, వింత ప్రసాద్‌రెడ్డి, వార నాగేశ్వరరావు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వీఆర్వో శ్రీనివాసరావు, లక్ష్మి అందజేశారు.

తెలికిచర్లలో బేతల్ మినిస్ట్రీస్ చర్చి ప్రారంభం



జాన్ వెస్లీని సత్కరిస్తున్న క్రైస్తవులు

నల్లజర్ల: బేతల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మండలంలోని తెలికిచెర్ల గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రార్థన మందిరాన్ని (చర్చి) ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి సంఘ కాపరి పాస్టర్ దావీదు రాజు అధ్యక్షత వహించారు. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు రెవరెండ్ జీజే జ్యోతి ఆనంద్ ముఖ్య సందేశం ఇచ్చారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ బి.జాన్ వెస్లీ మాట్లాడుతూ దేవుని ఆలయాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. దేవుని ఆలయాన్ని పరలోకపు గవినిగా బైబిల్‌లో పేర్కొందన్నారు. అందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జాన్ వెస్లీ క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్యాండిల్ సర్వీసు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాస్టర్లు జాన్ వెస్లీని ఘనంగా సత్కరించారు. మండలంలోని క్రైస్తవులు భారీ ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశు వ్యాధుల నివారణకు వైద్య శిబిరాలు



కుమారదేవంలో పాడి రైతులకు మందులు, టానిక్కులు అందిస్తున్న సహాయ సంచాలకుడు వెంకటరెడ్డి తదితరులు



చాగల్లులో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మనశ్శాంతి, నాయకులు

కొవ్వూరు: తుపాను వచ్చినందున పశువులు వ్యాధుల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని పశుసంవర్ధక శాఖ కొవ్వూరు ఉప సంచాలకుడు డాక్టర్ జి.రాధాకృష్ణ చెప్పారు. మండలంలోని కుమారదేవం పశు వైద్యశాల వద్ద శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గొంతు వాపు నివారణ టీకాలు వేశారు. వివిధ రకాల రుగ్మతలకు పరీక్షలు చేసి పాడి రైతులకు మందులు అందజేశారు. 42 మంది పాడి రైతులకు ఉచితంగా ఖనిజ,లవణ మిశ్రమాలను, లివర్ టానిక్స్ అందజేశారు. శిబిరంలో 35 ఆవులు, 80 గేదెలకు వైద్య సేవలు అందించామని సహాయ సంచాలకుడు వెంకటరెడ్డి తెలిపారు. గర్భకోశ వ్యాధి చికిత్సలు 22, నట్టల నివారణ మందులు, గొంతు వాపు వ్యాధి టీకాలు అందజేశామన్నారు. శిబిరంలో సర్పంచ్ కాసాని దుర్గ, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, కాసాని దుర్గారావు, పశు వైద్యులు బి.గిరీష్, ఎం బాలాజీ శంకర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ డి.రమణ, సహాయకులు పాల్గొన్నారు.

చాగల్లులో..

చాగల్లు: పశుసంవర్ధక శాఖ కొవ్వూరు ఏడీఏ డాక్టర్ జి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో చాగల్లు పశు వైద్యశాల వద్ద శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. 45 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. శిబిరంలో పశు వైద్యాధికారులు యు.ముఖేష్, ఎస్.సుజిత, వెటర్నరీ అసిస్టెంట్లు కె.రాజశేఖర్, విజయలక్ష్మి, కరిష్మా, శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు గౌతమ్ పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే సంక్షేమం

- అందుకే రాష్ట్రానికి మళ్లీ ఆయనే కావాలి
- పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు
- పలుచోట్ల సందడిగా వై ఏపీ నీడ్స్ జగన్



నిడదవోలు మండలం తాళ్లపాలెంలో సమాచార బోర్డును ఆవిష్కరిస్తున్న పల్లారావు, సూరిబాబు తదితరులు



నల్లజర్ల మండలం సుభద్రపాలెంలో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్

నిడదవోలు రూరల్: ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటిపై వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేయాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తాళ్లపాలెంలో రూ.17.89 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.5.72 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను నాయకులు ఎగురవేసి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సహ పంక్తి భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ గంధం నారయ్య, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సింగులూరి వెంకటేశ్వరరావు, నాయకులు వంగూరి రాజశేఖర్, వీరమల్లు త్రిమూర్తులు, వారా మణెమ్మ, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: గత నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. అందుకే ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మండలంలోని కానూరు సచివాలయం -2 వద్ద శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సచివాలయం పరిధిలో రూ.27.88 కోట్ల వ్యయంతో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే సమాచార పట్టికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలో ప్రదర్శన జరిపి, రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, జేసీఎస్ మండల కన్వీనర్ రామగుడుల సూర్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా, మండల శాఖల అధ్యక్షులు పొట్టి రాంబాబు, బీరా రాజు, సర్పంచ్ బావన మధు పూర్ణచందు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని సుభద్రపాలెంలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ చవ్వాకుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బిరుదుగడ్డ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టిన వివిధ సంక్షేమ,అభివృద్ధి పథకాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ కైలా నాగభూషణం, నాయకులు పాపా నాగేశ్వరరావు, ముప్పిడి వెంకటరత్నం, పెండ్యాల హరేరామకృష్ణ, బి.యోహాను, తానింకి వెంకన్న, ఎంపీడీఓ రాజశేఖరం, ఈఓపీఆర్డీ సింహాద్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సమాచార బోర్డును వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. వై ఏపీ నీడ్స్ బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకుల ఇళ్ల వద్ద జెండాలను ఎగురవేసి పల్లె నిద్ర చేశారు. పంచాయతీ సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మడు, కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, నాయకులు వెలగన రాంపండు, నూతంగి మురళి, ఉండవల్లి శ్రీనివాస్, కంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలవరం కుడి కాలువ సర్వీసు రోడ్లకు గండ్లు



శింగరాజుపాలెం వద్ద కాంక్రీటు లైనింగ్ దెబ్బతిన్న పోలవరం కుడి కాలువ

నల్లజర్ల: వరద నీటి ప్రవాహ ఉధృతికి పోలవరం కుడి కాలువకు శింగరాజుపాలెం ప్రాంతంలో సర్వీసు రోడ్లకు గండ్లు పడ్డాయి. స్ట్రక్చర్ల వద్ద ఇరువైపులా మట్టి కొట్టుకుపోయి సొరంగంలా ఏర్పడ్డాయి. అందుచేత వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగక ముందే తగు నివారణ చర్యలు చేపట్టాలని శింగరాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. పోలవరం కుడి కాలువ ఎస్ఈ బి.శ్యాంప్రసాద్, డీఈ కె.రాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.బాలకృష్ణ శుక్రవారం దెబ్బతిన్న కాంక్రీటు లైనింగ్, స్ట్రక్చర్ల వద్ద కొట్టుకు పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. సమీపంలోని మార్నెళ్లమూడి నుంచి లారీలు, భారీ వాహనాలు, స్కూలు బస్సులు నిత్యం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయని వైఎస్సార్ సీపీ ఆ గ్రామ నాయకుడు వామిశెట్టి పరమేశ్వరరావు అధికారులకు వివరించారు. ప్రమాదాలు సంభవించక ముందే తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఈ బి.శ్యాంప్రసాద్ హామీ ఇచ్చారు. అందుకోసం అంచనాలు రూపొందించాలని సంబంధిత ఏఈని ఆయన ఆదేశించారు.



పోలవరం కుడి కాలువ లైనింగ్ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వృద్ధాశ్రమంలో రగ్గుల పంపిణీ

చాగల్లు: వృద్ధులకు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రిటైర్డ్ ఎంఈఓ కోడి నాగేశ్వరరావు అన్నారు. గారపాటి బ్లెస్సింగ్ పుష్పవతి ఆర్థిక సహాయంతో చాగల్లు వృద్ధాశ్రమంలోని 56 మంది వృద్ధులకు శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆళ్ల సత్తిబాబు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ..

నల్లజర్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ప్రార్థిస్తూ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం రావికమతం మండలం జడ్.కొత్తపట్నానికి చెందిన గాలి గణేష్ అనే వ్యక్తి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం నల్లజర్ల చేరిన గణేష్ యాత్రకు సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, యువరాజు, నీరుకొండ జయకృష్ణ, మద్దిపాటి ప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపారు. భోజన వసతి ఏర్పాట్లు చేశారు. సీఎం జగన్ పుట్టిన రోజైన ఈనెల 21న తాను తిరుమలకు చేరుకొని మొక్కు చెల్లించుకుంటానని గణేష్ తెలిపారు. గణేష్ ఏయూ పూర్వ విద్యార్థి. వైఎస్సార్ కుటుంబానికి విధేయుడు. గతంలో ఐదు సార్లు పాదయాత్రలు చేశారు.